క్లుప్తంగా

జగనన్న గోరు ముద్ద పరిశీలన

గూడూరు: పట్టణంలో జెడ్పీ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరు ముద్ద పథకాన్ని సోమవారం ఎంఈఓ సునీమ్మతో కలిసి తహసీల్దార్ ఆంజనేయులు తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను రుచి చూసి వంట మహిళలకు సూచనలు ఇచ్చారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు.

దుకాణం దగ్ధం



మంటల్లో కాలిపోతున్న దుకాణం

గడివేముల: మండల పరిధిలోని బూజునూరు వైఎస్‌రెడ్డి పెట్రోల్‌బంకు సమీపంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో పంచర్‌దుకాణం పూర్తిగా కాలిపోయింది. దుర్వేశి గ్రామానికి చెందిన సంజీవరాయుడు కొన్ని రోజులుగా పంచర్‌షాపు, హోటల్ నిర్వహించుకునేవాడు. చుట్టుపక్కల చెత్తకు రైతులు నిప్పు పెట్టగా మంటలు దుకాణానికి వ్యాపించాయి. పూర్తిగా కాలిపోవడంతో రూ.2 లక్షల దాకా నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

ఎరువుల లారీ బోల్తా



పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన వివరాలు.. నంద్యాల నుంచి ఎరువుల లోడ్‌తో నన్నూర్‌కు వెళ్తున్న లారీ టైర్ పంక్చర్ కావడంతో హైవే నుంచి తగ్గులో ఉన్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ వెంకటసుబ్బయ్యకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది లారీని తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

సర్వేను పూర్తి చేయండి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి

గడివేముల: నాన్ కమ్యూనికల్ వ్యాధులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని నంద్యాల జిల్లా ఎన్‌సీడీ ఆఫీసర్ కాంతారావు నాయక్ తెలిపారు. సోమవారం మండలంలో జరుగుతున్న సర్వేను తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. సర్వేను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

తహసీల్దార్, డీటీ బదిలీ



తహసీల్దార్ శేషఫణి,



డీటీ కృష్ణమూర్తి

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు రెవెన్యూ మండల అధికారులు బదిలీ కావడంతో పాటు, మరో ఇద్దరు అధికారులు కార్యాలయానికి నియామకమైనట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. కార్యాలయంలోని తహసీల్దార్ శివశంకర్ నాయక్ గూడూరు మండల తహసీల్దార్‌గా బదిలీకాగా, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సరళ ఎమ్మిగనూరు మండల రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. అయితే కోడుమూరు మండల తహసీల్దార్ శేషఫణి సి.బెళగల్‌కు నియామకమయ్యారు. అదేవిధంగా కల్లూరు మండలం రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ఉంటూ, డిప్యూటేషన్‌పై గూడూరు మండలంలో విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మండలానికిరెగ్యులర్‌గానియమితులయ్యారు. అలాగే గోనెగండ్ల మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లు మండల తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీపై వచ్చారు. బదిలీ అయిన పై అధికారులు త్వరలో మండలంలోని తమ విధుల నుంచి రిలీవ్ కావడంతో పాటు బదిలీ వస్తున్న అధికారులు విధులలో చేరుతారని కార్యాలయ అధికారులు తెలిపారు.

కనెక్షన్ల మంజూరులో జాప్యం వద్దు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం వహించొద్దని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై. సుబ్బన్న సూచించారు. సోమవారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మంజూరు అయిన విద్యుత్ కనెక్షన్లను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. సిబ్బంది అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

పల్లె ప్రజల ఆరోగ్యానికి భరోసా

- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట
- గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాట్లు
- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్య సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కల్లూరు మండలం మార్కాపురంలో పూర్తి చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్,



గోనవరం గ్రామంలో ఇంటికి వెళ్లి వైద్యం చేస్తున్న డాక్టర్

పాణ్యం: గతంలో మెరుగైన వైద్య సేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వచ్చేవారు. ఆర్థిక స్థోమత లేని వారు అలాగే పలు దీర్ఘ వ్యాధుల బారిన పడి చికిత్స చేయించుకోలేక మంచంపట్టేవారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 'వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్'లను తీసుకొచ్చారు. వీటి ద్వారా కొన్నేళ్లుగా వైద్యం అందని గ్రామాలు, 108, 104 వాహనాలు వెళ్లని గ్రామాలలో కూడా నేడు చికిత్సలు అందుతున్నాయి. అంతే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఆసుపత్రికి వెళ్లలేని రోగుల వద్దకు డాక్టర్లే వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు.

2500 జనాభాకు ఒక హెల్త్ సెంటర్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రతి 2,500 జనాభాకు ఒక హెల్త్ సెంటర్ చొప్పున ఏర్పాటు చేసి, నూతన భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారు. అలాగే హెల్త్ సెంటర్‌లో 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు, 68 రకాల మందును అందుబాటులో ఉంచారు. హెల్త్ సెంటర్‌లో ఒక ఎంఎల్‌హెచ్‌పీతో పాటు ఏఎన్‌ఎం, గ్రామంలోని ఆశా వర్కర్లు అనుసంధానం చేస్తారు.

పాణ్యం నియోజకవర్గంలో 49 హెల్త్ క్లినిక్‌లు

హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలకు మొదటగా రూ.17.50లక్షలు కేటాయించగా, పెరిగిన ముడి సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకొని అదనంగా మరో రూ.3లక్షలు పెంచారు. ప్రస్తుతం వీటి నిర్మాణాలు చకచక జరుగుతున్నాయి. పాణ్యం నియోజకవర్గంలో 49 హెల్త్ సెంటర్లకు ప్రభుత్వం భవనాలు మంజూరు చేసింది. ఇప్పటికే కల్లూరు మండలం మార్కాపురం గ్రామంలో గతేడాది హెల్త్ సెంటర్‌ను పూర్తి చేసి ప్రారంభోత్సవం చేశారు.

పాణ్యం నియోజకవర్గంలో హెల్త్ క్లినిక్‌లు..

పాణ్యం–14 మంజూరు కాగా ప్రస్తుతం నాలుగు భవనాలు స్లాబ్ లెవెల్ పూర్తి చేసుకున్నాయి. మిగిలిన వివిధ దశల్లో ఉన్నాయి.

ఓర్వకల్లు–15 మంజూరయ్యాయి. వీటిలో నాలుగు భవనాలు దాదాపుగా పూర్తి కావచ్చాయి. మిగిలిన 10 వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన ఒక్కటి ఇంకా ప్రారంభం కాలేదు.

గడివేముల– 08 హెల్త్ క్లీనిక్‌లు మంజురయ్యాయి. వీటిలో 6 పూర్తి కావచ్చాయి. మిగిలిన బేస్ లెవెల్‌లో ఉన్నాయి.

కల్లూరు–12 మంజురు కాగా వీటిలో మార్కాపురం గ్రామంలో హెల్త్ క్లీనిక్ పూర్తి చేయగా గతేడాదే ప్రారంభించారు. 5 భవనాల పనులు ప్రారంభం కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దే వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకోవచ్చింది. ప్రతి గ్రామానికి నెలలో రెండు సార్లు వైద్యులు, సిబ్బంది సందర్శించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ చూసి ఆపై గ్రామంలో మంచంపై ఉన్నవారు, నడవలేని స్థితిలో ఉన్న ఇతర వ్యాధిగ్రస్తుల ఇంటింటికి వెళ్లి వైద్యం చేస్తారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఆరోగ్య విషయాలు తెలుసుకుంటారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

ప్రణాళిక ప్రకారం క్యాంపులు



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికి రెండు, సార్లు 104వాహనంతో వెళ్తున్నాం. అప్పటికే ఉదయం ఎంఎల్‌హెచ్‌పీలతో దీర్ఘకాలిక, మంచంపై ఉన్న రోగులను గుర్తిస్తాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో ఓపీ చూసిన తర్వాత మంచాన పడిన వారి ఇంటికి వెళ్లి వైద్యం చేస్తున్నాం. అలాగే వారి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుంటున్నాం. అంతేకాక 68 రకాల మందులను విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఉంచాం. ప్రతి రోజు అన్ని హెల్త్ క్లినిక్‌ల నుంచి సమాచారం తీసుకుంటాం. అందరికి మెరుగైన వైద్యం అందిచాలన్నాదే ప్రభుత్వం లక్ష్యం.

– డాక్టర్ భగవాన్‌దాస్, మద్దూరు పీహెచ్‌సీ

పాణ్యం నియోజకవర్గంలో హెల్త్ సెంటర్లు

మండలం	విలేజ్ క్లినిక్‌లు
పాణ్యం	14
ఓర్వకల్లు	15
గడివేముల	08
కల్లూరు	12
మొత్తం	49

గ్రామంలోనే వైద్య సేవలు



మా గ్రామం మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో కొండపై ఉంది. మా గ్రామం మాకు ఏ అత్యవసర వైద్యం, ఇతర సమస్యలు వచ్చినా బేతంచెర్ల, బనగానపల్లె, పాణ్యం, నంద్యాలకు వెళ్లాల్సి ఉంటుంది. గతంలో ఆరోగ్య సమస్యలొస్తే తీవ్ర ఇబ్బందులు పడేవారం. రోడ్డు అధ్వానంగా ఉన్న కారణంగా ఒకానొక సమయంలో 108, 104 వాహనాలు కూడా వచ్చేవి కూడా కావు. 2019 ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మొదటిగా మా గ్రామానికి బీటీ రోడ్డు వేయించారు. దీంతో గ్రామానికి 104, 108 వాహనాలు సాఫీగా వస్తున్నాయి. అంతేకాక ఫ్యామిలి డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వైద్య సిబ్బంది ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. దీంతో వైద్యం కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. మాకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుంది.

– రామచంద్రుడు, కందికాయపల్లె సర్పంచ్

ఈరోజు

ప్యాలకుర్తిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్ : మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డా.సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అలాగే వారి సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొనాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన సర్వసభ్య నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరయ్యే అవకాశం ఉందని, అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

సైన్స్‌పై అవగాహన అవసరం

కర్నూలు కల్చరల్: సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలను తొలగించాలంటే సైన్స్ గురించి తెలిసి ఉండాలని విజ్ఞాన వేదిక (జేవీవీ) జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణ కిశోర్ అన్నారు. సోమవారం కర్నూలు జిల్లా జేవీవీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ చదువుకున్న వారే సైన్స్‌ను ఉన్నది ఉన్నట్లు చూడకపోవడం బాధాకరమన్నారు. దేశ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూనే ప్రతి సమస్యను శాస్త్రీయ దృష్టితో చూడడం నేర్చుకోవాలన్నారు. జేవీవీ జాతీయ నాయకులు మహమ్మద్ మియ్యా, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజూరు బాష, శంకరరావు, సుజాత పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగనన్న



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 33వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ పార్టీలకు, వర్గాలకు, మతాలకు, కులాలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 33వ వార్డు పాత కల్లూరులో స్థానిక కార్పొరేటర్ నరసింహులు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో పర్యటిస్తూ వృద్ధులను, మహిళలను అప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల వల్ల వారు పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. కాలనీలో ఎవైన సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను తెలియజేయగా సకాలంలో పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, శ్వేతారెడ్డి, జయరాముడు, నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతురెడ్డి, కె.పుల్లారెడ్డి, రంగప్ప, జగదీష్, భాస్కర్, సుబ్బారెడ్డి, శివ, ఇస్మాయిల్, వీరేందర్, ఈశ్వరయ్య, వానప్ప పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని సస్పెండ్ చేయాలి

కర్నూలు (రూరల్): రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను సస్పెండ్ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు పి. శ్రావణి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఆంధ్ర ప్రదేశ్ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో అమ్మ హాస్పిటల్ నుంచి నంద్యాల చెక్ పోస్ట్ వరకు మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం నంద్యాల చెక్ పోస్ట్ సర్కిల్‌లో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పి. శ్రావణి రెడ్డి మాట్లడుతూ...దేశ కోసం ఆడే క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడడం సిగ్గు చేట్టన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి లలితమ్మ, గౌరవాధ్యక్షురాలు ప్రమీలమ్మ, పావని, వరలక్ష్మి, నాగేశ్వరమ్మ, రేణుక, నవోదయ మహిళ సంఘం నాయకురాలు గౌతమి, మహేశ్వరి, జయలక్ష్మి, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర స్థాయి భజన పోటీలు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ గ్రామంలో ఈ నెల 14న రాత్రి 10 గంటలకు రాష్ట్రస్థాయి భజన పోటీలు ఉంటాయని నిర్వాహకులు సోమవారం తెలిపారు. మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచి భజన బృందాలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఆలయ చెర్మన్ నంబర్లకు 8985808943, 9052450252 సంప్రదించాలని కోరారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్ : తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయిన మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన అమూల్య అనే మైనర్ బాలికను సోమవారం సాయంత్రం కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు తల్లిదండ్రులైన ఉమాదేవి, హరిక్రిష్ణలకు అప్పగించారు. గురువారం తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయిన బాలిక పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని రోడ్లపై తిరుగుతుండగా అక్కడి ఐసీడీఎస్ సిబ్బంది విచారించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీస్ సిబ్బంది బాలిక వివరాలు కనుక్కొని శనివారం ఫోన్ చేయడంతో ఎస్‌ఐ శ్రీనివాసులు బాలికను ఇంటికి పిలుచుకుని వచ్చేలా కోడుమూరు నుంచి హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు బాలిక తండ్రిని పంపించారు. సోమవారం తణుకు నుంచి వచ్చిన బాలిక అమూల్యను ఎస్‌ఐ శ్రీనివాసులు తల్లిదండ్రులకు అప్పగించి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్యాలకుర్తి గ్రామంలో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, దిశ కమిటీ సభ్యులు రమేష్‌లతో కలిసి ఇంటింటివెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి, సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కొందరు, ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని మరికొందరు, ప్రభుత్వ నిబంధనల వల్ల సంక్షేమ పథకాలు అందడం లేదని ఇంకొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అంగన్‌వాడీ సెంటర్–2 వద్ద నిరుపయోగంగా ఉన్న తాగు నీటి ట్యాంకును కూల్చివేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. రోడ్లు, కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలందేలా చూడాలని, శిథిలావస్థకు చేరిన ట్యాంకును కూల్చివేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ప్రసాద్, ఈఓఆర్డీ మంజులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు, ఏపీఎం పుష్పావతి, ఏపీఓ రమాదేవి, వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు శ్రీనివాసులు, మాదన్న, మిన్నెల్లి, సులేమాన్, రంగస్వామి పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 81 ఫిర్యాదులు

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 81 ఫిర్యాదులు స్పందనకు వచ్చాయి. వాటిపై విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలి

ఓర్వకల్లు: స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం తహసీల్దార్ తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలువురు రైతులు భూ సమస్యలపై వినతులు సమర్పించారు. ఇందులో భాగంగా తాము సాగుచేసుకున్న భూములను ఆర్ఓఆర్ రికార్డు ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నన్నూరు, ఓర్వకల్లు, కాల్వ, హుసేనాపురం గ్రామాల రైతులు వినతి పత్రాలు సమర్పించారు. శివాయజాములను సాగు చేసుకున్న వారికి అసైన్‌మెంట్ కమిటీలో డి పట్టాలు మంజూరు చేయాలని హుసేనాపురం గ్రామానికి చెందిన వీరలక్ష్మి విజ్ఞప్తి చేశారు. తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుబుక్, టైటిల్‌డీడ్ మంజూరు చేయాలని కన్నమడకల గ్రామానికి చెందిన అంకాలి చిన్న వెంకటస్వామి విన్నవించారు. ప్రభుత్వ ప్రాజెక్టుల నిమిత్తం తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించాలని కొంతలపాడు గ్రామానికి చెందిన మంద నాగమద్దయ్య తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఏఓ సుధాకర్, ఆర్ఐ రంగస్వామి, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, ఏపీఓ కుమార్‌సాయినాథ్ పాల్గొన్నారు.

గూడూరు రూరల్: ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులకు స్పందించి పరిష్కారం చూపాలని సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ మాధవీలత సూచించారు. గుడిపాడు సచివాలయంలో సోమవారం చేపట్టిన స్పందనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

స్పందన సమస్యలను పరిష్కరించండి



సమస్యను తెలుసుకుంటున్న అధికారులు

సి.బెళగల్: స్పందన సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు ఇతర మండల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయా శాఖల మండల అధికారులకు సూచించారు. స్పందనలో ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఏఈలు గోనేనాయక్, సూర్యప్రకాష్, ఏపీఓ లక్ష్మన్న, హౌసింగ్ ఏఈ సుమంత్ తదితరులు ఉన్నారు.

తొలిరోజు సర్కారు స్కూళ్లు కళకళ

- పాఠశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- స్కూల్ ప్రారంభం రోజునే మొదలైన అడ్మిషన్లు
- జగనన్న కిట్లను అందించిన ఉపాధ్యాయులు



సి.బెళగల్ మండలం పోలకల్ రెగ్యులర్ స్కూల్‌కు చేరుకుంటున్న విద్యార్థులు



బూజునూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినిని అడ్మిషన్ చేయిస్తున్న తల్లి

గడివేముల: వేసవి సెలవుల అనంతరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు సోమవారం విద్యార్థులతో కళకళలాడాయి. నాడు–నేడు పనులతో మారిన పాఠశాలలను విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి తిలకించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు పోటి పడ్డారు. మండలంలో 31 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఒక్కరోజులోనే వివిధ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు దాదాపు 150కి పైగా కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ చేసుకున్నారు. పాఠశాలలో చేరిన రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుల కిట్లను అందజేశారు.

నాడు–నేడు పనులతో మారిన రూపురేఖలు

నాడు నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేసిన విషయం తెలిసిందే. విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి క్లాసులు, విద్య అందించాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాడు –నేడు పనుల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. కూర్చోవడానికి బండలేని బడులకు మా పిల్లలను పంపేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్న తల్లిదండ్రులు నేడు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు క్యూ కడుతున్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాది

కోడుమూరు రూరల్ : రాష్ట్రంలోని పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చక్కటి పునాది వేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని ప్యాలకుర్తి హైస్కూల్లో నిర్వహించిన జగనన్న విద్యాకానుకల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా గతేడాది పది పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చిన ప్యాలకుర్తి హైస్కూల్ విద్యార్థిని నస్రీన్ (517), లలిత (501)లకు ఎమ్మెల్యే మెమొంటోలతో పాటు, నగదు ప్రోత్సహకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, హెచ్‌ఎం మారుతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బడులకు చేరిన బుడతలు

సి.బెళగల్: దాదాపుగా నెలనర రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు సోమవారం పునఃప్రారంభం కావడంతో మండలంలోని గ్రామాలలో బుడతలు వడివడిగా అడుగులను పాఠశాలల వైపు ఉత్సాహంగా సాగించారు. మండలంలోని పోలకల్ గ్రామ రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మొదటి రోజు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. పాఠశాల హెచ్‌ఎం రేవుల శ్రీనివాసులు, టీచర్లు, విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి బాలబాలికలకు జగనన్న విద్యా కానుకలను అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలకు క్యూ...

పాణ్యం : 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు పిల్లలు క్యూ కడుతున్నారు. సోమవారంతో పాఠశాలలు ప్రారంభం కాగా పిల్లలు అధికంగా వచ్చి అడ్మిషన్లు తీసుకున్నారు. మొదటి రోజే మండలంలో 80కి పైగా అడ్మిషన్లు వచ్చాయని ఎంఈఓ కోటయ్య తెలిపారు.

విద్యా కానుకతో విద్యార్థుల చదువులకు భరోసా

కల్లూరు : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పిల్లలను చదువులకు ఇబ్బందులు పడకుడదనే ఉద్దేశంతో జగనన్న విద్యా కానుకను అందిస్తూ వారి చదువులకు భరోసా కల్పిస్తున్నారని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం బస్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. అలాగే కార్పొరేటర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, శ్వేతారెడ్డి వారి వార్డులోని పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు.

గూడూరు రూరల్ : పెంచికలపాడులోని హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు హెచ్‌ఎం చంద్రశేఖర్ విద్యా కానుక కిట్లను ఆయన అందించారు.

ఓర్వకల్లు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మంజూరు చేసిన విద్యా కానుకలను ముమ్మరంగా విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ సునంద తెలిపారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 7457 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి విద్యా కానుక అందజేశారన్నారు.

కర్నూలు (టౌన్) : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని గొందిపర్ల గ్రామ సర్పంచ్ బి. శ్రీనివాసులు అన్నారు. సోమవారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలోని వసంతనగర్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. హైస్కూల్ హెచ్‌ఎం సంపత్‌కుమార్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్యాలకుర్తి హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



బస్తిపాడులో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, ఎంఈఓ



గడివేముల జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ,హెచ్‌ఎం